# హేపీ బర్త్ డే

లోపలికి వొస్తూనే చేతిలో పర్సు, దిద్దవలసిన పరీక్ష పేపర్లు అలమారలో పెట్టి, పెరట్లోకి వెళ్ళి కాళ్ళు కడుక్కొచ్చింది తులసి.

మధ్యాహ్నమే మొదలైంది స్కూల్లో తలనెప్పి .... భరించలేని తలనెప్పి. ఇంటికీ స్కూలుకీ చాలా దూరం. బస్సుకోసం పడిగాపులు పడి ఇంటి కొచ్చేటప్పటికి రోజూ నీరసమే .... దానికి తోడు ఇప్పుడీ తలనెప్పి .... ముందు గదిలోకొచ్చి, వాల్చి ఉన్న మడతమంచమ్మీద కూర్చుంది.

గబగబా రేకుపెట్లోంచి రెండు చీరలు తీసుకువొచ్చి తులసి ఒళ్లో పడేసింది కాత్యాయిని. "ఈ రెండిట్లో ఏది బావుందో చెప్పవే .... "

నీరసంగా నవ్వింది తులసి. "రెండూ బానేఉన్నాయమ్మా– కొంచెం కాఫీ ఇస్తావా ? "

కాఫీ పడితే కొంచెం మాట్లాడే ఓపిక వొస్తుందేమోనని ఆశ.

" రెండూ బానే ఉన్నాయని అలా తేల్చేస్తావేమిటి ? రెండిట్లోనూ ఎక్కువగా ఏది బాగుందో చెప్పు – అది ఉంచేసి రెండోది ఇచ్చేస్తాను కొట్లో, అలా అని ముందే కొట్టువాడితో చెప్పే తీసుకొచ్చాను "

అసలెందుకిప్పుడు నెలాఖర్లో కొత్తచీర కొనడం ? ఇంకా జీతాలు రావడానికి ఆర్రోజులుంది — ఇప్పుడే కారణం లేకుండా కొత్తచీర కొనడం దేనికో ? చటుక్కున అనిపించించింది తులసికి. ఒకవేళ — నాలుగు రోజుల్లో తన పుట్టినరోజు వొస్తోంది - అందుకని తనకి చీర కొందామని అనిపించిందేమో అమ్మకి — ఖర్చు తన జీతంలోంచే.... నిజమే. కానీ, అసలా అలోచన అమ్మకి రావడమే గొప్ప - అందుకు సంతోష పడాలి ఈ ఇంట్లో తన బాగోగులు ఎవరికీ పట్టవని - ఇన్నాళ్ళుగా మనసులోనే కుమిలిపోతూ, యాంత్రిక జీవితం గడుపుకొస్తోంది తను. నెల నెలా తను తెచ్చే ఆ నాలుగు జీతపురాళ్ళకోసం ఇంట్లో సభ్యు లందరూ ఎదురు చూస్తారే తప్ప తన కష్టం సుఖం ఎవరికీ అక్కర్లేదు — ఇప్పుడు - ఇన్నాళ్ళకి - అమ్మకి హఠాత్తుగా తన పుట్టినరోజు గుర్తొచ్చి నట్టుంది. అంత నీరసంలోనూ - తులసి కళ్ళల్లోకి వింత మెరుపొచ్చింది. యాంత్రిక జీవితంలో పడి ఆ నం ద ం అంటే ఏమిటో ఎప్పుడో మర్చిపోయింది - అటువంటి ఆమెకి — తన పుట్టినరోజు అమ్మకి గుర్తొచ్చి నందుకు చీర కొనుక్కోమని అంటున్నందుకు (తన జీతంలోంచే అయితే అవుగాక) ఆనందంతో కళ్ళు చెమర్చాయి. మళ్ళీ మళ్ళీ అడుగుతోంది కాత్యాయిని " ఏది ఎక్కువ బాగుందో చెప్పవే , "

నీరసాన్ని అవతలకి నెట్టి రెండు చీరలూ చేత్తో పట్టుకుని చూసింది.

" ఇదెక్కువ బాగుందమ్మా " నీలంరంగు చీర ముందుకి చాపింది

" ఏమో — గిరిజకి ఈ ఎర్రచీరే ఎక్కువ నచ్చిందట — అయినా కట్టుకోబోయేది అదేగా - దానికి నచ్చిందే తీసుకుంటాను "

తుళ్ళిపడింది తులసి. " గిరిజ కోసమా ? " అప్రయత్నంగా పైకే అనేసింది ఆ మాట.

" - దానికోసమే. దానికేమన్నా పెళ్ళి సంబంధాలు చెప్పమని ఆ మధ్య శాస్త్రిగారితో చెప్పార్లే నాన్నగారు — "

నిజమా ? తనకి తెలియనే తెలియదు - ఇంట్లోవాళ్ళకే దాపరికం తన దగ్గర ? ఎందుకో ?

" పదహారోఏడు వచ్చేసింది కదా - ఇంక పెళ్ళి చేసెయ్యడం మంచిదని అనుకుంటున్నాం. ఈ ఊళ్లో సంబంధమే ఒకటి చెప్పి వెళ్ళారు శాస్త్రిగారు - ఎల్లుండి పిల్లని చూసుకుందుకు వొస్తారని, నిన్న మధ్యాహ్నం చెప్పివెళ్ళారు. రాత్రి నువ్వేవో పేపర్లు దిద్దుకుంటున్నావని మధ్యలో మాట్లాడించడమెందుకని చెప్పలేదు నేను - "

మధ్యలో మాట్లాడించడ మెందుకని చెప్పలేదా ? భేష్ - బావుంది- ఇంటిలో జరుగుతున్న ముఖ్యమైన విషయాలు కూడా - ఒక ముక్క తన చెవిని వేద్దామని అనిపించలేదన్నమాట - చివుక్కుమంది తులసి మనసు.

" ఎల్లుండి అది కట్టుకుందుకు మంచి చీరేముంది ? నీ చీరేదన్నా కట్టుకుంటుందేమో అనుకుంటే, అక్క చీరలేం బావుండవు - అన్నీ పాతవే - నా కొద్దు పొమ్మంది - అందుకని - నీ జీతం రాగానే ఇచ్చేయొచ్చులే అని - పక్కింటావిడ దగ్గర తీసుకున్నాను డబ్బు "

పదహారో ఏడు వొచ్చిందిగా, పెళ్ళి చేసెయ్యడం మంచిదని - ఆ మాటలే చెవుల్లో మారుమోగుతున్నాయి తులసికి. తనకెన్నో ఏడు ఇప్పుడు ? - ఇరవయ్యారు -

పదేళ్ళకిందట తనకి పదహారో ఏడు వొచ్చింది. ఈ పదేళ్ళలోనూ అమ్మా, నాన్నగారూ ఎప్పుడూ తన పెళ్ళిమాట ఎత్తనేలేదే ? ఎప్పుడూ తన పెళ్ళి విషయం ఆలోచించలేదే ? చెల్లికి పదహారోఏడు రావడం బాగానే గుర్తుపెట్టుకున్నారే వాళ్ళు ! తనకి మటుకు పదహారోఏడు రాకుండానే హఠాత్తుగా ఇరవయ్యారోఏడు నెత్తిమీది కొచ్చిపడిందా ? ఏడవలేక నవ్వుకుంది తులసి.

తులసికి ముందు ఇద్దరు మొగపిల్లలు పుట్టిపోయారు. తులసి తర్వాత రెండు మూడేళ్ళకి పుట్టినవాడు తిరుగుళ్ళకి అలవాటుపడి చదువబ్బక ఇల్లొదిలి పారిపోయాడు. ఆ తర్వాత మరో ఇద్దరు మొగపిల్లలు, ఒక ఆడపిల్ల బాగా ఆలస్యంగా పుట్టడంతో తులసికి, వాళ్ళకి వయసులో తేడా ఉంది.

తండ్రి శివరామయ్య కొట్లో పద్దులు రాసేవాడు. పక్షవాతం వొచ్చాక పనికిపోవడం మానేశాడు. మంచంలోనే కాలం గడచిపోతోంది.

తల్లి లోపలికెళ్ళడం గమనించనేలేదు తులసి. ఎదురుగా తల్లి లేకపోవడంతో, కాఫీ కలపడానికి లోపలికి వెళ్ళిందేమోననుకుంది.

తనకి పదహారేం ఖర్మ ఇరవయ్యేళ్ళొచ్చాయి. అయినా వాళ్ళు పట్టించుకోరు. వాళ్ళకది అనవసరం. తన అవసరం వాళ్ళకి చాలా ఉంది. తనకి పెళ్ళిచేసి పంపిస్తే ఇల్లు నడవడం ఎంత కష్టమో ఊహించుకో గలరు వాళ్ళు. అందుకే పెద్దకూతురి వయసు మర్చిపోయారు. కనీసం మర్చిపోయినట్టు నటిస్తున్నారు. అనవసరంగా తనే ఇంకా గుర్తుపెట్టు కుంటోంది తన వయసు. ఇరవయ్యేళ్ళు రాగానే తనని ముసలివాళ్ళ లిస్టులో వేసేసినట్టున్నారు. ఈ రోజుల్లో ఆడపిల్లలు పాతికేళ్ళొచ్చి పెళ్ళిళ్ళు చేసుకోవడం అబ్బురమేమీ కాదు. కానీ తనామాట అంటేమటుకు పెళ్ళికోసం మొహంవాచిపోయినట్లు సిగ్గులేకుండా ఎలా మాట్లాడుతోంటో అని, తనన్లో వింత జంతువుని చూసినట్టు చూస్తారు.

తల్లి కాఫీ కలుపుతున్న జాడేమీ కనిపించక తనే లేచి వంటింటి వైపు నడిచింది తులసి.

లోపలి గదిలో ఇంకా ఆ చీరల గురించే చిన్నకూతురు గిరిజతో మాట్లాడుతోంది కాత్యాయిని.

" నీకా ఎర్రచీరే నచ్చిందన్నావుగా. అదే ఉంచుతాన్లే. నీలంది తిరిగి కొట్లో ఇచ్చేస్తాను "

కలుక్కుమంది తులసి మనసు అమ్మ మాటలు వినపడి.

" పోనీ - నీలంచీర అక్కకి నచ్చిందట. ఎలాగూ నాలుగు రోజుల్లో అక్క పుట్టినరోజు వొస్తోంది - ఏదో ఎప్పుడూ లేకపోయినా, ఈసారి పుట్టినోరోజుకి చీర తీసుకున్నట్టు ఉంటుంది. అక్కకోసం ఈ నీలం చీర ఉంచేస్తాను. అది చీర కొనుక్కుని కూడా చాలా నాళ్ళయిపోయిందిగా దానివీ అన్నీ పాతబడిపోయాయి " అని ఒక్క ముక్క అమ్మ అంటే తనకెంత తృప్తి. వీలుంటే రెండు చీరల ఖర్చు ఈ నెల భరించగలిగితే తీసుకుంటుంది. తనకోసం, అమ్మ చెప్తే - భరించలేకపోతే తీసుకోనే తీసుకోదు రెండోచీర. చెల్లికి మాత్రం కొని ఊరుకుంటుంది తన పుట్టిన్రోజుకి తనే వెళ్ళి ఓ కొత్త చీర కొనేసుకు రావడం వేరు. రేపు నీ పుట్టిన్రోజుకి కొత్త చీర కొనుక్కోవే - చీరలన్నీ పాతబడిపోయాయిగా అని అమ్మ తన నోటితో తనంటే అందులో ఉన్న తృప్తి వేరు.

ఆలోచిస్తూనే కాఫీ కలుపుతుంది.

ఆరున్నర నించీ ఏడున్నర వరకూ ఒక అరడజనుమంది పిల్లలకు అయిదోక్లాసు దాకా ట్యూషన్ చెప్తుంది తులసి.

ఇంకాస్సేపట్లో ఆ పిల్లలొస్తారు.

తలనెప్పని ఇవాళ ట్యూషన్ మానెయ్యడానికి వీల్లేదు.

ఆ పిల్లలకి హాఫియర్లీ ఎగ్జామ్స్ దగ్గిరకొచ్చేశాయి. వాళ్ళని బాగా రుద్దాలి మరి.

" కాఫీ తాగుతున్నావా అక్కా ! ఆ కలిపింది నాకిచ్చెయ్యి " నువ్వు మళ్ళీ కలుపుకో - నేను సినిమాకెళ్ళాలి - ఆలస్యమైతే టిక్కెట్టు దొరకదు " గ్లాసులో కాఫీలో అప్పుడే పంచదార వేసి తులసి కలుపుతుంటే

తుఫాన్లా వంటింట్లోకి దూసుకొచ్చిన పెద్దతమ్ముడు, గద్దలా ఆ గ్లాసు తన్నుకుపోయాడు.

తెల్లబోయి చూసింది తులసి - ఇంక డికాక్షన్ లేదు. మళ్ళీ వెయ్యాలి.

టీచింగ్ లైన్లో ఉన్నవాళ్ళకి బాగా పేషన్స్ ఉండాలి - ఔను - లేకపోతే ఎలా ? ఔను - తనకి బాగా పేషన్సుంది - ఉండాలి - ఏడవలేక నవ్వుకుంది తులసి. మళ్ళీ డికాక్షన్ వేసింది. ఈసారి రెండో తమ్ముడొచ్చి కాకిలా తన్నుకుపోవచ్చు - నువ్వు కాఫీ బాగా కలుపుతావు కొంచెం నాక్కూడా ఇయ్యవా నీచేత్తోటి అంటూ తనకి మస్కా కొడుతూ, మురిపాలుపోతూ చెల్లమ్మగారు అడగచ్చు. అందుకే కొంచెం ఎక్కువే వేసింది డికాక్షన్.

" అదేవిటే అంత డికాక్షన్ వేశావు ? ముగ్గురికి సరిపోతుంది ఇంట్లో అంతా ఎప్పుడో తాగేశారు. నువ్వొక్కదానివే తాగాలి. అనవసరంగా అంత డికాక్షన్ వేశావ్ - అందుకే నువ్వు వంటయింట్లోకి వస్తేనే భయం నాకు. ఓ పొదుపూ, పద్ధతీ ఏమీలేవు నీకు " అరగంట దాకా గొణుగుతూనే ఉన్న తల్లిని, మౌనంగానే చూసింది తప్ప మాట్లాడలేదు తులసి.

గొంతుకడ్డుపడిన బాధ దిగమింగుకోవడంలో కాఫీ గొంతు దిగడం తెలియనేలేదు. కాఫీ తాగిన ఫలితం కనిపించలేదు.

తాగిన కాఫీ గ్లాసు తొలిచిపెట్టేసి ముందు గదిలోకి వొచ్చి కూచుంది.

" దొండకాయ వొద్దమ్మా - బంగాళాదుంప వేపుడు చెయ్యి " వంటింటి గడపమీద కూచుంది గిరిజ.

" సరే అయితే బంగాళాదుంప వేపుడే చేస్తాను నాదేం పోయింది" దొండకాయలు మళ్ళీ బుట్టలో పోసేసి బంగాళదుంపలు తరగడం మొదలు పెట్టింది కాత్యాయిని.

ఓ పొదుపూ పద్ధతీ ఏమీ లేవు నీకు అంటూ అనవసరంగా తనని తరచుగా మందలించే అమ్మ మాటలు తల్చుకుని నవ్వుకుంది తులసి. మూడురోజులైంది అమ్మ ఆ దొండకాయలు కొని - అవి ఉండగానే అవి చెయ్యకుండా వేరే ఏదో ఒకటి ఇంకో కూర కొనేస్తూనే ఉంది. ఇంకా ఎన్నాళ్ళుంటాయి ఆ దొండకాయాలు పండిపోకుండా - అవి పండి పోయాయని రేపొ్పద్దున్న పారేస్తుంది చివరికి - బంగాళదుంపలు ఇవ్వాళ కొంది. అవి నిలవ ఉండేవేకదా ? కానీ తానామాట అనకూడదు. అంటే—

*

పెళ్ళివారొచ్చారు గిరిజను చూసుకున్నారు. వెళ్ళారు - " మాకొ్కంచెం టైమివ్వండి - ఆలోచించుకుని ఏ సంగతీ కబురుచేస్తాం" మన్నారు వెళ్ళేటప్పుడు - సరే మంచిదే - ఆలోచించుకునేఁదా చెప్పాల ఎవరైనా ? ఈ లోపల ఆడపిల్ల ఊహాలోకాల్లో తేలిపోతూ, వాళ్ళదగ్గర్నుంచి జవాబు వొచ్చేదాకా తన ఇష్టమొచ్చినట్టు కలలు కంటూ కూచోడానికి, ఎవరూ ఏ టాక్సూ వెయ్యరుగా ! ఎటొచ్చి ఆ జవాబు సుముఖంగా లేకపోతే ఆ టాక్సేదో ఆ పిల్ల కళ్ళే కట్టుకుంటాయి కన్నీటి రూపంలో.

గిరిజే కాదు. కాత్యాయిని కూడా — చిన్నకూతురి పెళ్ళి కుదిరి పోయినట్టే సంబరంగా వుంది. ఏ అడ్డూ ఆటంకం లేకుండా ఈ సంబంధం కుదిరితే అంతే చాలని ఏడాపెడా మొక్కులు మొక్కేసుకుంటోంది.

ఇంట్లో అంతా కూడా పెళ్ళివారి దగ్గర్నుంచి మధ్యవర్తి తీసుకొచ్చే కబురుకోసం ఆతృతగా ఉన్నారు.

*

ఆ రోజు సాయంత్రం స్కూల్‌నించి బస్‌స్టాప్ కొస్తుంటే ఎదురు వచ్చాడు రాంబాబు.

" నమస్తే టీచర్ "

బదులుగా తల ఊపి చిన్నగా నవ్వింది తులసి.

స్కూల్లో టెన్త్‌వరకూ తన స్టూడెంటే రాంబాబు. ఎప్పుడూ ప్రతి క్లాసులోనూ ఫస్టే – ప్రతి క్లాసులోనూ అందర్లోకీ బుద్ధిమంతుడూ, గుణవంతుడూ అన్న పేరు తెచ్చుకున్నాడు కుడా. ఇప్పుడు ఫస్ట్‌ఇయర్ బి. ఎస్‌సి. చదువుతున్నాడు. మొదటినించీ కూడా అతనికి తనంటే చాలా గౌరవం – అసలు వయసుకంటే భారీతనం కనబడుతుంది రాంబాబులో. బాగా పొడగ్గా, బొద్దుగా ఉంటాడు.

" టీచర్‌గారూ – మీరేమీ అనుకోకపోతే – మీతో ఒక విషయం చెప్పాలి " ఎంతో సంశయం అతని గొంతులో.

" చెప్పు రాంబాబూ "

" ఇక్కడా ? " ఇబ్బందిగా చూశాడు అటూ, ఇటూ.

" సరే అయితే నాతో మా ఇంటికి రా. అక్కడ చెప్దువుగాని " తడబడి పోయాడు రాంబాబు, ఇంట్లో చెప్పమనగానే. టీచర్‌గారింటివద్ద ఈ విషయం మాట్లాడటం, అసలు ఇష్టంలేదు. అందుకేగా ఇంటికి వెళ్ళలేదు. లేకపోతే – నిన్ననే ఇంటికెళ్ళి ఈ విషయం టీచర్‌గారి చెవినివేసి ఉండేవాడు.

" వొద్దు టీచర్. ఇంటిలో వొద్దులెండి – మీరేమీ అనుకోకపోతే ఒక్క అయిదు నిమిషాలు – అలా పార్కులోకి వెళ్దాంరండి. అక్కడ చెప్తాను " భయంభయంగా అడిగాడు.

సరిగ్గా తాము ఉన్నది పార్కు గేటు కెదురుగానే అన్న విషయం అప్పుడు గమనించింది తులసి.

" సరే పద. " నవ్వుతూ, పార్కులోకి దారితీసింది.

ఎవరూలేని ఓ పక్కగా గడ్డిలో చతికిలపడింది.

" అ - ఇప్పుడు చెప్పు. ఏమిటసలు విషయం ? భలే సస్పెన్సులో పెట్టావు. "

ఎలా చెప్పాలో తెలియనట్టు ఒక్క నిమిషం దిక్కులు చూశాడు టీచరుగారికి ఎదురుగా కూర్చుని.

" చెప్పు రాంబాబూ ! భయమెందుకూ ? "

" ఇలా చెప్తున్నందుకు మీరు కోపం తెచ్చుకోరుగా టీచర్ ? "

" నా కోపం ఎప్పుడైనా చూశావా నువ్వు ? " అతి మృదువుగా అడిగింది.

లేదన్నట్టు తల అడ్డంగా ఊపాడు.

" మరింకేం ? భయపడకుండా నువ్వేం చెప్పాలనుకుంటున్నావో చెప్పు " ధైర్యం చెప్పింది శిష్యుడికి.

గడ్డిపరకలు చేత్తో లాగుతూ, ఏం చెప్తాడా అన్న కుతూహలంతో అతని మొహంలోకి చూసింది.

కానీ, సూటిగా టీచర్‌గారి మొహంలోకి చూస్తూ చెప్పలేక తల దించుకుని చిన్నగా అన్నాడు రాంబాబు. "టీచర్ - మరేమో ! ఈమధ్య కొన్నాళ్ళుగా మీ తమ్ముడు రవణ చాలా అసభ్యంగా మాట్లాడుతూ, మా చెల్లెలి వెనక రోజూ - పడుతున్నాడట టీచర్ - నిన్న ఫ్రెండ్స్‌తో బెట్ కట్టి స్నేహితురాళ్ళతో కల్సి వెళ్తున్న మా చెల్లెల్ని రోడ్డుమీద చెయ్యిపట్టుకుని లాగాడట. ఏడుస్తూ ఇంటికొచ్చిపడిందది. మానాన్నగారికి చాలా కోపం వచ్చింది. నేనే ఆయన్ని శాంతపరచాను. మా టీచర్‌గారి

తమ్ముడే కాబట్టి ముందు మా టీచర్‌గారితో చెప్తాను. తమ్ముడిని ఆవిడ అదుపులో పెడతారు, మందలిస్తారు అని చెప్పాను. మీ తమ్ముడి ప్రవర్తన విషయం మీకూ, మీ ఇంట్లోవాళ్ళకీ తెలియడం ముఖ్యం కదా టీచర్ ! అందుకని - మీతో చెప్తున్నాను. గురువుగారితో శిష్యుడిలా మాట్లాడటం తప్పే కావచ్చు - నన్ను క్షమించండి టీచర్ " చాలా బాధ పడ్డాడు రాంబాబు నిజంగా, ఈ మాటలు చెప్పడానికి.

మనసులో భావాలు కళ్ళల్లో కనిపించిపోకుండా చాలా ప్రయాస పడింది తులసి.

" భలేవాడివే ! నువ్వేం తప్పుచేసావని, క్షమించమని అడుగుతున్నావు ! గురువుగారు కళ్ళుమూసుకుని ఉంటే తెరిపించడం తప్పెలా అవుతుంది ! టీచర్‌గారి తమ్ముడు కదా అని చెప్పకుండా మానెయ్యలేదు. నయమే కదా ! చాలా థ్యాంక్స్ రాం బా బూ - చెప్పినందుకు - మా తమ్ముడి ప్రవర్తన ఊళ్లో అందరికీ తెలిసి, ఇంట్లో వాళ్ళం మాకే తెలియకపోవడం అది మాకే సిగ్గుచేటు " మనస్ఫూర్తిగా అంది తులసి.

" కానీ - రాంబాబూ నా స్టూడెంట్స్ నేను చెప్తే మంచి, చెడ్డా వింటారేమోగాని, నా తమ్ముళ్లు, వినరు, రాంబాబూ వినరు. కనీసం క్లాస్‌రూమ్‌లో ఉన్నంతసేపైనా, నా స్టూడెంట్స్‌ని నేను కంట్రోల్‌లో పెట్టగలనేమోగానీ, కనీసం, ఇంట్లో ఉన్నప్పుడైనా, నా తమ్ముళ్ళని నేను కంట్రోల్‌లో పెట్టలేను రాంబాబూ. ఇది నిజం - నూటికి నూరుపాళ్ళూ నిజం - ఇంట్లోనే వాళ్ళని కంట్రోల్ పెట్టలేనిదాన్ని బయటవాళ్ళ ప్రవర్తన కంట్రోల్ చేయగలనా ? " ఈ మాటలు మనసులోనే అనుకుని, చిన్నగా నిట్టూర్చింది తులసి.

" తమ్ముడికి బుద్ధిచెప్పమని మా నాన్నగారితో కూడా చెప్తాను - చాలా థ్యాంక్స్ రాంబాబూ ! నీకు నా మీదున్న గౌరవానికి మా ఇంటిలో అందరి తరపునా నేను క్షమాపణ చెప్పుకున్నానని చెప్పు మీ చెల్లితో "

" అయ్యయ్యో ! అంత మాటనకండి టీచర్ - మిమ్మల్ని బాధ పెట్టాలని కాదు నేను చెప్పింది "

" లేదు నువ్వు చెప్పడంలో తప్పులేదు. చెప్పకపోతేనే తప్పు " ఇంకేముంది మాట్లాడడానికి ? నిశ్శబ్దం రాజ్యమేలింది కాసేపు,

టీచర్‌గారి మనసు కష్టపెట్టానే అని శిష్యుడు, మాట చెప్పడానికి శిష్యుడెంతగా తర్జన భర్జన పడివుంటాడోనని టీచర్ తల్లడిల్లారు కాసేపు.

" ఇక వెళ్దామా " తులసి గొంతులో ఎప్పటిలా మృదుత్వమే నర్తించింది, పక్కన పెట్టిన హ్యాండ్‌బ్యాగ్ అందుకుని లేచింది. రాంబాబు కూడా లేచాడు. పార్కు బయటికొచ్చాక ఎవరిదోవన వాళ్ళు చీలిపోయారు.

ఆ షాపు ముందునుంచి నడుస్తుంటే బయట సీసాల్లో చాక్‌లెట్లు కనిపించగానే, అటువైపు నడిచింది తులసి. కాసిని చాక్‌లైట్స్‌ని కొని హ్యాండ్‌బ్యాగ్‌లో పడేసింది. బస్ స్టాప్‌లో బస్సుకోసం ఎదురుచూస్తూ నిలబడింది. ఇంటికెళ్ళగానే ముందు ఇంటిలో అందరికీ చాక్‌లెట్స్ ఇవ్వాలి. అప్పుడైనా అమ్మ నవ్వు మొహంతో " అన్నట్టు ఇవాళ నీ పుట్టిన్రోజు కదుటే " అంటుందేమో చూడాలి.

" ఇవాళ నీ పుట్టినరోజా అక్కా " అని సంబరంగా తన మొహంలోకి చూస్తూ తమ్ముళ్ళూ, చెల్లెలూ అంటారేమో చూడాలి.

ఆ తర్వాతెప్పుడో మెల్లగా రాత్రి, అమ్మతోనూ నాన్నగారితోనూ తమ్ముడి విషయం చెప్పి కాస్త భయం, బుద్ధీ చెప్పమని చెప్పాలి - ఇలా సాగిపోతున్నాయి తులసి ఆలోచనలు. బస్సొచ్చింది ఇంతలో - తోసుకుంటూ ఆ జనంలో బస్సులో జొరబడడం పద్మవ్యూహాన్ని ఛేదించు కుంటూ పోయినట్టే - మళ్ళీ దిగడం అదో రగడ తోపుడు. సగం నిస్త్రాణ బస్సుకోసం వెయిట్ చేయడంతో వస్తుంది. మరో సగం బస్సు ఎక్కడం, దిగడంతో వస్తుంది - వీటన్నిటినీ మించిన నిస్త్రాణ ఇంట్లో వాళ్ళ ప్రవర్తనతో వస్తుంది తులసిలాంటి వాళ్ళకి.

ఒంటికాలిమీద నిలబడగలిగినా చాలు అదే పదివేలు, అసలింటి కంటూ వెళ్ళిపడతాం అనుకుంటే ఆ ఒంటికాలిమీద నిలబడగలగడం కూడా గగనంగా వుంది తులసికి ఆ సాయంత్రపు రద్దీలో బస్సులో.

ఇంటిలో అడుగుపెడుతుంటే, అప్పుడే ఇంట్లోంచి బయటికి వస్తున్నారు తమ్ముళ్ళిద్దరూ, చెల్లెలూ. అందంగా తయారయ్యారు ముగ్గురూనూ....ఎక్కడికో బయల్దేరారు!

వాళ్ళవంక చూస్తూ చిన్నగా నవ్వబోయింది. కానీ, వాళ్ళ మొహాలు చూసి నవ్వంటే ఏమిటో మర్చిపోయినదానిలా అయిపోయింది.

ఎందుకు ముగ్గురూ అంత కోపంగా చూస్తున్నారు, తన వంక? తనేం పాపం చేసుకుంది?

"ఎక్కడికో బయల్దేరినట్టున్నారు—ఒక నిముషం. చాక్‌లెట్స్ ఇస్తాను మీ ముగ్గురికీ" గబగబా హ్యాండ్‌బ్యాగ్‌లోంచి తియ్యబోయింది.

"ఇంతోటి చాక్‌లెట్‌కోసం మే మాగితే, మాకు సినిమాకి టైము అయిపోతుంది"

విసురుగా వాళ్ళు వెళ్ళిపోతుంటే అవాక్కయి నిలబడింది తులసి. కనీసం చాక్‌లెట్ ఎందుకూ, ఏమిటని కూడా వాళ్ళు అడగకుండా అలా చీదరించుకున్నట్టు వెళ్ళిపోతుంటే చిన్నబుచ్చుకుంది తులసి మనసు— వాళ్ళు సినిమాకెళ్తున్నారా? ఎప్పుడూ వాళ్ళు ముగ్గురే కలిసి వెళ్తారు. తనని, వొస్తావా అని కూడా అడగరేం ఎప్పుడూ? తన వయసెంత: ఇరవయ్యారు-ఇరవయ్యారేళ్ళదాన్లా ఉండాలనే తనెప్పుడూ ప్రయత్నిస్తుంది. కాని ఇంట్లోవాళ్ళు తనని అలా ఉండనివ్వరేం? అరవయ్యేళ్ళదాన్లా మానసికంగా ముసలిదాన్లా తను వుండాలని వాళ్ళ ఉద్దేశం — ఈ వయసులో అరవయ్యేళ్ళదాన్లా ఎలా వుండగలదు తను? ఎందుకుండాలి అసలు? కన్న తల్లిదండ్రులకోసం పాటుపడడం తప్పుకాదు, ఇంతో అంతో

త్యాగాలు ఇంట్లోవాళ్ళకోసం చేయడం తప్పు కాద—గొప్పా కాదు. కానీ తనని ఒక మనిషిగా చూడక మరబొమ్మగా చూస్తేమటుకు, ఆ బాధ భరించటం చాలా కష్టం. మొహం కడుక్కుని బట్టలు మార్చుకొచ్చింది తులసి.

" చెల్లెలి పెళ్ళవడం నీ కిష్టంలేదా ? " తల్లి గొంతులోంచి కరుకుగా వచ్చిన ఆ మాటలకి ఉళ్ళిపడింది. " అమ్మా ? ఏమిటి నువ్వనేది ? "

" లేకపోతే ఏమిటి ? ఎవరో అబ్బాయితో పార్కులలో తిరుగుళ్ళేమిటి ? తీరా చెల్లెలికి సంబంధాలు చూస్తుంటే ఇప్పుడిలాంటి పన్లేమిటి ? ఇప్పుడీ సంగతి వాళ్ళకి తెల్సిందంటే మొన్న గిరిజని చూసుకెళ్ళినవాళ్ళు మీ సంబంధం మా కిష్టంలేదని కబురు చేసెయ్యరూ ? దానికి పెళ్ళవడం నీ కిష్టంలేదా ఏమిటి ? రవణ చూశాట్ట ఎవర్తో అబ్బాయితో నువ్వు పార్కులో కెళ్ళడం "

అంతా అర్థమైపోయింది తులసికి. ముందరకాళ్ళకి బంధంగా తనమీదే కథ అల్లి అమ్మతో చెప్పాడన్నమాట రవణ—తనని తను రక్షించుకుందుకు—ఈ తెలివితేటలు చదువులో వుంటే ఎంత బాగుండేది ! ఇప్పుడింక తనేం చెప్పినా అది కథే అవుతుంది, కల్పనే అవుతుంది అమ్మ ఉద్దేశంలో—రవణ వొచ్చాక వాడిని ఎదురుగా పెట్టుకుని మాట్లాడటమే మంచిది. ట్యూషన్ పిల్లలొచ్చేదాకా తన ఆలోచనల్లో తనుండిపోయింది. వాళ్ళొచ్చాక, హ్యాండ్‌బ్యాగ్‌లోంచి చాక్‌లెట్స్ తీసి పిల్లలందరికీ ఇచ్చింది.

" ఇవాళ మీ హేపీ బర్త్ డే నా టీచర్ ? " ముక్తకంఠంతో అడిగారు పిల్లలు, వికసించిన పువ్వుల్లా నవ్వులు వెల్లివిరుస్తున్న ముఖాలతో. ఆ పలకరింపుకి కదిలిపోయింది తులసి మనసు.

గుండెల్లోంచి తన్నుకొస్తున్న ఆవేదనని అక్కడే అదిమిపెట్టి గుటక మింగింది.

ఆర్ద్రతకి అర్థం తెలిసినట్టయింది.

చిరునవ్వుని పె దా ల మీ ది కి తీసుకొచ్చింది మనస్ఫూర్తిగా నే ప్రయత్నపూర్వకంగా కాదు.

వాళ్ళడిగిన ప్రశ్నకి తల ఊపింది ఔనన్నట్టుగా.

" హేపీ బర్త్ డే టు యూ " అంటూ పిల్లలు ముద్దుముద్దుగా మూడుసార్లు రాగయుక్తంగా పాడారు.

అందర్లోకీ వయసులో కాస్త పెద్దపిల్లాడు ఏదో గుర్తొచ్చినట్టు గబగబా తన నోట్ బుక్ పేజీలు తిప్పి, నాలుగురోజుల క్రిందట తనకి దొరికితే భద్రంగా ప్రాణప్రదంగా ఆ పేజీల మధ్య దాచిపెట్టుకున్న నెమలి ఈకను తీసి టీచరుగారికి అందించాడు.

" తీసుకోండి టీచర్ - చాలా బావుంది కదూ - మా అత్తయ్య కొడుకు పదిపైసలిస్తానన్నా వాడికివ్వలేదు నేను. నాకు కావాలని దాచుకున్నాను. మీరు తీసుకోండి టీచర్ - మీ పుస్తకంలో పెట్టుకోండి - నాకు మళ్ళీ ఎప్పుడన్నా ఇంకోటి దొరుకుతుందిలెండి - పుస్తకంలో కొంచెం బియ్యంగింజలేసి ఈ నెమలి ఈక పెట్టండి టీచర్ - ఆ బియ్యం తిని నెమలీక పిల్లలు పెడుతుందిట - మా మావయ్య కొడుకు చెప్పాడు "

వాడి అమాయకపు మాటలకి నవ్వూ, వాడి ప్రేమాభిమానాలకి సంతోషం పొంగి పొర్లాయి తులసిలో.

ఆప్యాయంగా ఆ నెమలిఈకని అందుకుని మురిపెంగా దానివంక చూసి ముద్దుపెట్టుకుంది పెదాలకి చేర్చి అతి సున్నితంగా.

తనకి బుద్ధి తెలిసాక, ఇన్నేళ్ళలో, తన ఏ పుట్టినరోజూ కూడా ఇంత సంతృప్తిగా ఇంత ఆనందంగా గడపలేదనిపించింది తులసికి.